గద్దెపై కొలువుదీరిన సమ్మక్క తల్లి

- దారి పొడవునా పసుపు, కుంకుమలతో ముగ్గులు
- పోలీసుల తుపాకీ వందనంతో సమ్మక్కకు స్వాగతం
- మేడారం గద్దెలపై ఆసీనులైన నలుగురు వన దేవతలు
- ఎదురెల్లి స్వాగతం పలికిన రాష్ట్ర మంత్రి, అధికార యంత్రాంగం
- యాట బలులు, ఎదురుకోళ్లు, ఒడి బియ్యం మొక్కులు
- ఆదివాసీల నృత్యాలు, శివసత్తుల పూనకాలు

చిలుకలగుట్ట నుంచి గద్దెల దాకా ఎదురేగిన భక్తజనం

గద్దెపైకి చేరుకున్న సమ్మక్క

ములుగు, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ): మేడారం వనాలు గురువారం సమ్మక్క నామ స్మరణతో మార్మోగాయి. అడవి అంతా భక్తజన సందోహంతో నిండిపోయింది. ఆదివాసీ జాతరలో అతి ముఖ్యమైన కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. లక్షలాది భక్తుల పారవశ్యం, గిరిజన యువతుల నృత్యాలు, కోయదొరల డోలు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలు, హిజ్రాల మొక్కులు, అధికారిక లాంఛనాలతో జిల్లా ఎస్పీ శబరీష్, పోలీసు ఉన్నతాధికారులు తుపాకీతో సమర్పించిన గౌరవ వందనం మధ్య రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సీతక్కతోపాటు జిల్లా కలెక్టర్ సమ్మక్కకు సాదర స్వాగతం పలికారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ ఆదివాసీ వడ్డెలు (పూజారులు) వనదేవత సమ్మక్కను మేడారం గద్దెలపైకి తోడ్కొనివచ్చారు. సమ్మక్క చిలుకలగుట్ట నుంచి మేడారం గద్దెలపైకి చేరుకునే ఈ పతాక ఘట్టాన్ని చూసేందుకు లక్షలాది భక్తులు తరలివచ్చారు. 'సమ్మక్కో.. సారక్కో.. నమో సమ్మక్క.. జై సమ్మక్క..' అంటూ మొక్కులు సమర్పించారు. సమ్మక్క ఉండే చిలుకలగుట్ట జనంతో కిటకిటలాడింది. అక్కడినుంచి మేడారం వరకు కిలోమీటరున్నర దారి ఇరువైపులా భక్తజనంతో నిండిపోయింది. చిలుకలగుట్ట నుంచి మేడారానికి సమ్మక్కను తీసుకొచ్చే గిరిజన జాతర ప్రధాన ఘట్టం గురువారం సాయంత్రం 7:11 గంటల నుంచి రాత్రి 9:22 గంటల వరకు ఉద్విగ్న క్షణాల నడుమ కొనసాగింది.

ఎదురేగిన భక్తులు

వన దేవత సమ్మక్కను మేడారం గద్దెలపైకి తీసుకొచ్చే కార్యక్రమం గురువారం ఉదయమే మొదలైంది. వడ్డెలు ఉదయం మేడారం సమీపంలోని చిలుకలగుట్ట అడవిలోకి వెళ్లి వనం (వెదురు కర్రలు) తెచ్చి గద్దెలపై ప్రత్యేక పూజలు చేశారు. సమీపంలోని సమ్మక్క పూజా మందిరం నుంచి అడేరాలు (కొత్త కుండలు)ను తెచ్చి గద్దెలపైకి చేర్చారు. అనంతరం కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను గద్దెపైకి తెచ్చేందుకు వడ్డెల బృందం సాయంత్రం 4 గంటలకు చిలుకలగుట్టపైకి బయల్దేరారు. అప్పటికే చిలుకలగుట్ట ప్రాంతం మొత్తం భక్తులతో నిండిపోయింది. దారి పొడవునా పసుపు, కుంకుమల ముగ్గులు వేసి సమ్మక్క రాక కోసం భక్తులంతా కన్నార్పకుండా చిలుకలగుట్టపైకి చూస్తుండి పోయారు. కుంకుమ భరిణె రూపంలో ఉన్న అడవి తల్లిని చేతపట్టుకున్న మరుక్షణమే సమ్మక్క ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య తన్మయత్వంతో ఒక్క ఉదుటున చిలుకలగుట్ట దిగారు. మిగిలిన వడ్డెలు క్రిష్ణయ్యను తోడ్కొని వచ్చారు. సమ్మక్క రాకకు సూచనగా ఆ దేవతను ఆహ్వానిస్తూ ప్రభుత్వం తరపున అధికారిక లాంఛనాల ప్రకారం ఎస్పీ పీ శబరీష్ ఏకే-47 తుపాకీతో గాల్లోకి కాల్పులు జరిపారు. అనంతరం ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సైతం ఏకే-47 తుపాకీ ట్రిగ్గర్‌ను నొక్కారు. సమ్మక్క రాకను సూచించే ఈ శబ్దంతో ఒక్కసారిగా చిలుకలగుట్ట ప్రాంతం భక్తి

భావంతో ఉప్పొంగిపోయింది. సమ్మక్క నామ స్మరణతో చిలుకలగుట్ట ప్రాంతం మార్మోగింది. ఆదివాసీ యువకుల రక్షణ వలయం, పోలీసు బలగాల నడుమ వడ్డెల బృందం సమ్మక రూపంతో మేడారం వైపు బయల్దేరారు. వంద మీటర్లు దాటగానే ఒకసారి, చిలుకలగుట్ట దాటే సమయంలో మరోసారి ములుగు ఎస్పీ తుపాకీ కాల్పులు జరిపి సమ్మక్కను ఆహ్వానించారు. అక్కడినుంచి భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆదివాసీ పూజారుల బృందం సమ్మక్కను మేడారం గద్దెలపైకి తరలించడం మొదలుపెట్టారు. సమ్మక్కకు ఎదురుగా కోళ్లను, గొర్రెలను బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల పూనకాలతో శివాలూగారు. మొక్కుల కోసం తెచ్చుకున్న ఒడి బియ్యాన్ని దారిలో సమ్మక్క రూపంపై వెదజల్లారు. కొందరు భక్తులు ఆ బియ్యాన్ని ఏరుకుని దాచుకున్నారు. సమ్మక్కను తోడ్కొని వస్తున్న బృందం అక్కడి నుంచి చెలపెయ్య గుడికి చేరుకోగా. వనదేవతకు అక్కడి పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేడారం గద్దెలకు బయలుదేరారు. మేడారం గద్దెల ముఖద్వారం వద్ద ఆ ఊరి ఆడబిడ్డలు సమ్మక్కను తీసుకొస్తున్న పూజారుల కాళ్లు కడిగి స్వాగతం పలికారు. అక్కడికి చేరుకున్న భక్తులు ఆ అపురూప క్షణాలను చూసి మైమరిచిపోయారు. ఈ ఉద్విగ్న సమయంలో పూజారులు సమ్మక్కను గద్దెలపైకి చేర్చారు.

30 లక్షల మంది రాక

సమ్మక్క గద్దెలపైకి వచ్చే సమయంలో ఆవరణలో విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. సమ్మక్క గద్దెలపైకి చేరిన తర్వాత కరెంట్ సరఫరా కొనసాగించారు. మొదట మేడారంవాసులు, జిల్లా అధికారులు మొక్కులు చెల్లించుకున్నారు. నలుగురు వన దేవతలు.. సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజులు, పగిడిద్దరాజు గద్దెలపైకి చేరడంతో మొక్కులు సమర్పించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. సమ్మక్క గద్దెల

పైకి చేరే రోజు కావడంతో గురువారం ఒక్కరోజే 30 లక్షల మంది మేడారానికి తరలివచ్చారు.

సమ్మక్క-సారలమ్మ తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకలు

సమ్మక్క-సారలమ్మ భక్తులకు కేసీఆర్ శుభాకాంక్షలు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి చారిత్రక ప్రతీకలుగా, ఇలవేల్పులుగా సబ్బండ వర్గాల పూజలందుకుంటున్న మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రెండేండ్లకోసారి జరిగే మేడారం జాతర ఆసియా ఖండంలోనే అతిపెద్ద అడవిబిడ్డల జాతరగా, తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిందని పేర్కొన్నారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో కొనసాగిన ఆత్మగౌరవ పోరాటంలో, సమ్మక్క-సారలమ్మ అందించిన స్ఫూర్తి ఇమిడి ఉన్నదని గుర్తుచేశారు. ఒకనాడు కల్లోలిత ప్రాంతంగా నాటి సమైక్యపాలకుల ఏలుబడిలో అలజడులకు గురైన గోదావరీలోయ పరీవాహక ప్రాంతం నేడు సాగునీటి జీవజలంతో సస్యశ్యామలమై ప్రజల జీవితాల్లో సాంత్వన నింపిందని పేర్కొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి తల్లుల దర్శనార్థం కోట్లాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించాలని ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణ ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు నిండేలా చూడాలని వనదేవతలను ప్రార్థించారు.

సమ్మక్క గిరిజన యూనివర్సిటీకి 900 కోట్లు విడుదల

- ఈ ఏడాది నుంచే అడ్మిషన్లు

ములుగు, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : సమ్మక్క-సారక్క కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.900 కోట్లు విడుదల చేసిందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులను ప్రారంభిస్తామని, జాకారం యూత్ వైటీసీలో తాత్కాలికంగా తరగలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశామని అన్నారు.

మేడారంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో మంత్రి సీతక్క

గురువారం ఆయన రాష్ట్ర మంత్రి సీతక్కతో కలిసి మేడారం మహాజాతరకు హాజరై సమ్మక్క-సారలమ్మను దర్శించుకున్నారు.

'సమ్మక్క బరాజ్'పై ఛత్తీస్‌గఢ్ మళ్లీ పేచీ

హైదరాబాద్, ఫిబ్రవరి22 (నమస్తే తెలంగాణ): ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద గోదావరి నదిపై నిర్మించిన సమ్మక్క బరాజ్‌కు ఎన్‌వోసీ ఇచ్చేందుకు పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కొత్త పేచీని పెట్టింది. 88 మీటర్ల వరకు ముంపునకు గురయ్యే భూములకు సైతం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నది. సమ్మక్క బరాజ్ ఎఫ్ఆర్ఎల్ (పూర్తిస్థాయి నీటినిల్వ) 83 మీటర్లు కాగా, ఆ మేరకు నీటిని నిల్వ చేసినప్పుడు మాత్రమే ఛత్తీస్‌గఢ్‌లో భూములు ముంపునకు గురవుతాయని, ఆ మేరకు ముంపునకు గురయ్యే భూములకు పరిహారం చెల్లిస్తామని ఛత్తీస్‌గఢ్ ఎదుట తెలంగాణ ప్రతిపాదించింది. ఎన్‌వోసీ ఇచ్చేందుకే తొలుత సుముఖత వ్యక్తంచేసింది. కానీ ఎఫ్ఆర్ఎల్ 83 మీటర్ల వరకు గాకుండా, 88 మీటర్ల వరకు ముంపునకు గురయ్యే భూములకు పరిహారం చెల్లించాలని షరతు విధించింది.

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన గాడితప్పింది

బీజేపీ నేత ఈటల రాజేందర్

జైనూర్, ఫిబ్రవరి 22 : రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన సరిగా లేదని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఈటల రాజేందర్ అన్నారు. గురువారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలో విజయ్ సంకల్ప యాత్రలో భాగంగా ఈటల రాజేందర్ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు దాదాపుగా 400కు పైగా హామీలు ఇచ్చిందని అన్నారు. ఇందులో కేవలం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించినప్పటికీ రాష్ట్రంలో బస్సులు కరువయ్యాయని విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు ప్రజలను మోసం చేసేందుకేనని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఏవీ అమలుకు సాధ్యం కావని తెలిపారు. రూ.2 లక్షల రుణమాఫీ కూడా రేవంత్‌తో సాధ్యం కాదని స్పష్టం చేశారు. తాను గత ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా చేసిన అనుభవంతో చెబుతున్నానని అన్నారు. అధికారంలోకి రావడానికే రేవంత్‌రెడ్డి ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు చేశారని విమర్శించారు.

హామీల అమలులో రేవంత్ విఫలం

బీజేపీ ఎంపీ లక్ష్మణ్

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 22: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జాతీయ నాయకుడు, ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. గురువారం చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో జరిగిన విజయసంకల్ప యాత్రలో లక్ష్మణ్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని చెప్పారు. దేశ అభివృద్ధి కోసం బీజేపీ ఎంపీలను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తనను ఎంపీగా మరోసారి గెలిపిస్తే చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. శంషాబాద్ పట్టణంలో ఫ్లైఓవర్‌ను నిర్మించింది మోదీ ప్రభుత్వమేనని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో ధరణి కమిటీ భేటీ!

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): ధరణి పునర్నిర్మాణ కమిటీ గురువారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యింది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ ఇప్పటివరకు గుర్తించిన అంశాలను సీఎంకు వివరించినట్టు తెలిసింది. ఈ నెల 24న అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా వారు ఇచ్చే సమాచారం ఆధారంగా ఒక ప్రాథమిక నివేదిక రూపొందిస్తామని చెప్పినట్టు సమాచారం. దీంతో శనివారం కలెక్టర్ల సమావేశం అనంతరం ఈ అంశంపై సమగ్రంగా చర్చిద్దామని ధరణి కమిటీకి సీఎం సూచించినట్టు తెలిసింది.

వర్గీకరణ పేరుతో బీజేపీ నాటకాలు

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 22: వర్గీకరణ పేరుతో బీజేపీ మాదిగలతో నాటకమాడుతున్నదని టీఎస్ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ విమర్శించారు. కమిటీ పేరుతో కాలయాపన చేయకుండా లోక్‌సభ ఎన్నికల్లోపే పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. గురువారం నిజామాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

కరెంటు తీస్తే కొలువు పీకేస్తా

మొదటిపేజీ తరువాయి...

ఘటనలపై విద్యుత్తుశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కొందరు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేందుకు, విద్యుత్తుపై దుష్ప్రచారం చేసేందుకు కొందరు కుట్రలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని.. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించం

ఇటీవల రాష్ట్రంలో మూడు సబ్‌స్టేషన్ల పరిధిలో కొంతసేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగిందని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రిజ్వీ సమాచారం ఇవ్వగా, అందుకు కారణాలేమిటని సీఎం ప్రశ్నించారు. సబ్‌స్టేషన్లలో లోడ్ హెచ్చుతగ్గులను డీఈలు సరిచూసుకుంటూ ఉండాలని, అలా చూడకపోవడంతో సమస్య తలెత్తిందని అధికారులు సీఎంకు విన్నవించారు. దీనిపై ఆగ్రహం వ్యక్తంచేసిన సీఎం.. అలా నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏవైనా మరమ్మతులు, ఇతర అంశాల వల్ల సరఫరా నిలిపివేయాల్సి వస్తే ముందుగానే ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని వినియోగదారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో నియమితులైన కొందరు క్షేత్రస్థాయి సిబ్బంది అత్యుత్సాహంతో ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు ఉద్దేశపూర్వకంగా కోతలు పెడుతున్నారనే సమాచారం తమకు ఉన్నదని తెలిపారు. ఎక్కడైనా ఐదు నిమిషాలకు మించి విద్యుత్తు సరఫరా నిలిచిపోతే, అందుకు గల కారణాలపై వెంటనే సమీక్షించుకోవాలని ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా కోతలకు కారణమైతే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్తు అవసరం ఎక్కువగా ఉండే ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ పీక్ సీజన్‌కు సరిపడేంత విద్యుత్తును అందించే కార్యాచరణను ప్రభుత్వం ఇప్పటికే సిద్ధం చేసుకొన్నది. ఫిబ్రవరిలో ఒకటో తేదీ నుంచి 13 తేదీవరకు రోజుకు 264.95 మిలియన్ యూనిట్ల విద్యుత్తు సరఫరా అయ్యింది. గత ఏడాది అదేకాలంలో 242.44 మిలియన్ యూనిట్లు సరఫరా అయ్యింది. నిరుడు జనవరిలో 230.54 మిలియన్ యూనిట్లు సరఫరా కాగా.. ఈ ఏడాది జనవరిలో 243.12 మిలియన్ యూనిట్లు సరఫరా అయ్యిందని అధికారులు వివరించారు.

రైతుబంధుపై మళ్లీ నాలుక మడత

సీఎం రేవంత్‌రెడ్డి వాయిదాల పర్వం

- డిసెంబర్ 9వ తేదీనే వేస్తామన్న సీఎం
- ఫిబ్రవరి నెలాఖరు అని మరో మాట
- తాజాగా మళ్లీ మాటమార్చిన ముఖ్యమంత్రి
- మార్చి 15కు పంపిణీ అంటూ కొత్త పల్లవి
- ఇప్పటివరకు 4 ఎకరాల్లోపే పంపిణీ
- ఈసారి రైతుబంధు పూర్తిపై సందిగ్ధత

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): రైతులకు రైతుబంధు పెట్టుబడి సాయం పంపిణీపై సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి నాలుక మడతేశారు. ఈ నెలాఖరులోపు మొత్తం రైతుబంధు పంపిణీ చేసే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని గతంలో ప్రకటించిన సీఎం.. తాజాగా మాట మార్చేశారు. మరోసారి గడువు పెంచి మార్చి 15వ తేదీ వరకు మొత్తం రైతుబంధు పంపిణీ చేస్తామని కొత్త పల్లవి ఎత్తుకున్నారు. 'ప్రతి సన్నాసోడు ఇంకా రైతుబంధు ఏస్తడలేడని అంటున్నరు. గత సంవత్సరం మార్చి 31 వరకు కూడా రైతుబంధు వేయలేదు. ఫిబ్రవరి నెలాఖరు వరకు 63 లక్షల రైతు కుటుంబాలకు రైతుభరోసా ద్వారా మీ ఖాతాల్లో నగదు బదిలీ చేసే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుంది' అని ఈ నెల 2వ తేదీన ఎల్బీ స్టేడియంలో జరిగిన తెలంగాణ కాంగ్రెస్ యూత్ లీడర్స్ కన్వెన్షన్‌లో సీఎం ప్రకటించారు. తాజాగా ఆ తేదీని ఆయనే మార్చేసి మార్చి 15 అని ప్రకటించారు. ఈ నేపథ్యంలో రైతుబంధు ఎప్పుడు పడుతుందో.. పంపిణీ ఎప్పుడు పూర్తవుతుందో.. అసలు పూర్తవుతుందో లేదో అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రైతుబంధు పంపిణీపై మాయ మాటలు చెప్తూ కాలం గడిపే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో ఏ సీజన్‌లోనూ మరీ ఇంతలా ఎదురు చూడాల్సిన పరిస్థితి రాలేదని రైతులు చెప్తున్నారు.

అడిగిన వారిపై విమర్శల దాడి

రైతుబంధు పంపిణీలో జరుగుతున్న జాప్యంపై ప్రశ్నించేవారిపై ప్రభుత్వం ఎదురుదాడికి దిగుతున్నదనే విమర్శలున్నాయి. మొన్నటికి మొన్న రైతుబంధు ఎప్పుడు పూర్తవుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని విలేకరులు ప్రశ్నించగా...'రైతుబంధు పడలేదు అన్నవారిని చెప్పుతో కొట్టండి' అని ఆయన అహంకారపూరితంగా మాట్లాడారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఇదే ధోరణిలో మాట్లాడటం గమనార్హం. రైతుబంధు అడిగినవారిని 'సన్నాసోడు' అని కించపరిచే వ్యాఖ్యలు చేశారు.

3 ఎకరాల లోపే..

డిసెంబర్ 7వ తేదీన సీఎంగా ప్రమాణం చేసిన రేవంత్‌రెడ్డి... డిసెంబర్ 9వ తేదీ నుంచే రైతుబంధు పంపిణీని ఆర్భాటంగా ప్రారంభించింది. దీంతో యాసంగి సీజన్‌కు దాదాపు నెల రోజుల ముందే రైతుబంధు పెట్టుబడి సాయం అందుతుందని రైతులంతా సంబురపడ్డారు. కానీ ఆ సంబురం క్రమంగా ఆవిరైపోయింది. పెట్టుబడి సాయం కోసం కండ్లు కాయలు కాసేలా ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. డిసెంబర్ 9న ప్రారంభించిన రైతుబంధు పంపిణీ సుమారు రెండున్నర నెలలు గడిచినప్పటికీ పూర్తి కాకపోవడం గమనార్హం. ఇప్పటివరకు 4 ఎకరాలలోపు రైతులకు మాత్రమే రైతుబంధు జమైనట్టు తెలిసింది. అత్యధికంగా 3 నుంచి 3.5 ఎకరాల వరకు మాత్రమే పడినట్టు సమాచారం. మిగిలిన రైతులకు ఎప్పటికి పడుతుందోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వానకాలం సీజన్‌లో 1.52 కోట్ల ఎకరాలకు గాను సుమారు 70 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయాన్ని గత ప్రభుత్వం పంపిణీ చేసింది. మొత్తం రైతుబంధు కింద 11 విడతల్లో సుమారు రూ.73 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసింది.

హన్వాడ మండలంలో కాంగ్రెస్ పార్టీ అందించిన గోడ గడియారాలు

కాంగ్రెస్ 'ఎన్నికల' ప్రలోభాలు

- ఇంటింటికీ తిరుగుతూ గోడ గడియారాల పంపిణీ
- వాటిపై కాంగ్రెస్ గుర్తు, నేతల ఫొటోల ముద్రణ

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 22: పార్లమెంట్ ఎన్నికలకు కోడ్ కూయనేలేదు.. కాంగ్రెస్ నేతలు అడ్వాన్స్‌గా కానుకలు అందజేస్తూ ప్రలోభాలకు పాల్పడుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు మండలాల్లో హస్తం పార్టీ గుర్తు, సీఎం రేవంత్, స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డితోపాటు ఎంపీ ఎన్నికల్లో పోటీ చేయబోయే వంశీచందర్‌రెడ్డి ఫొటోలతో కూడిన గోడ గడియారాలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేస్తున్నారు. ఈ విషయం జిల్లాలోని హన్వాడ మండలంలో గురువారం వెలుగుచూసింది. 'మీ ఇంటికి గడియారం వచ్చిందా?' అంటూ ఆ పార్టీ నాయకులు అడుగుతుండటంపై గ్రామాల్లో జోరుగా చర్చ సాగుతున్నది. ఎన్నికల కోడ్ రాకముందే గడియారాల పంపిణీ పూర్తి కావాలని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామ స్థాయిలోనూ ఈ గడియారాలను అందించినట్టు తెలుస్తున్నది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ నేతలు గడియారాలు అందించి ఓటర్లను ప్రభావితం చేయడం సరికాదని ఇతర పార్టీల నేతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

500 చెల్లిస్తే సిలిండర్

క్యాబినెట్ సబ్‌కమిటీ సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన డిప్యూటీసీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, పొంగులేటి

- పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేయండి
- 27 లేదా 29వ తేదీన మరో రెండు గ్యారెంటీలకు శ్రీకారం
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచన
- విధి విధానాలపై ఉన్నతస్థాయి సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): లబ్ధిదారు గ్యాస్ ఏజెన్సీకి కేవలం రూ.500 చెల్లిస్తే ఆయా ఏజెన్సీలు వారికి సిలిండర్ పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఇందుకోసం గ్యాస్ ఏజెన్సీలతో చర్చలు జరపాలని, ప్రభుత్వం తరపున చెల్లించాల్సిన సబ్సిడీ నిధులను వెంట వెంటనే వారికి చెల్లించేందుకు ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి ప్రజాపాలన దరఖాస్తులపై ఏర్పాటైన క్యాబినెట్ సబ్‌కమిటీతో సమీక్ష నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో ఆయా పథకాల అమలుకు అనుసరించాల్సిన విధి విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. వారం రోజుల్లో మరో రెండు గ్యారెంటీలను అమలుచేసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు సరఫరా, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాల అమలుకు వెంటనే సన్నాహాలు చేయాలని సూచించారు. వీటిని ఈ నెల 27 లేదా 29 తేదీల్లో అమలుచేయాలని సూచనప్రాయంగా నిర్ణయించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులందరికీ లబ్ధి జరిగేలా చూడాలని స్పష్టంచేశారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీని నేరుగా లబ్ధిదారుల ఖాతాకు బదిలీ చేయాలా? లేదా ఏజెన్సీలకు చెల్లించాలా? ఈ క్రమంలో ఉన్న అడ్డంకులు, ఇబ్బందులు, సాధ్యాసాధ్యాలపై పౌరసరఫరాలు, ఆర్థికశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

రేషన్‌కార్డు ఉంటే గృహలక్ష్మి అమలు

ఎలాంటి అనుమానాలు, అపోహలకు తావులేకుండా గృహజ్యోతి పథకాన్ని పారదర్శకంగా అమలుచేయాలని విద్యుత్తు శాఖ అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తెల్ల రేషన్‌కార్డు ఉండి 200 యూనిట్ల లోపు గృహ విద్యుత్తు వినియోగించే వారందరికీ ఈ పథకాన్ని వర్తింపజేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. మార్చి మొదటి వారం నుంచి విద్యుత్తు బిల్లు జారీ చేసేటప్పుడు అర్హులందరికీ గృహజ్యోతి కింద జీరో బిల్లులు జారీ చేయాలని సూచించారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో కార్డు నెంబర్లు, కనెక్షన్ల నెంబర్లలో తప్పుల కారణంగా జీరో బిల్లుకు అర్హత కోల్పోయిన వారెవరైనా ఉంటే సవరించుకునే అవకాశమివ్వాలని ఆదేశించారు. అన్ని విద్యుత్తు బిల్లు కలెక్షన్ సెంటర్లు, సర్వీస్ సెంటర్లలో ఈ సవరణ ప్రక్రియను చేపట్టాలని సూచించారు. ప్రజలందరికీ తెలిసేలా విద్యుత్తుశాఖ ప్రచారం చేయాలని కోరారు. తప్పులను సవరించుకున్న అర్హులందరికీ ఏప్రిల్ నుంచి ఈ పథకాన్ని వర్తింపజేయాలని, అర్హులందరికీ లబ్ధి జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టంచేశారు. సమావేశంలో సీఎస్ శాంతికుమారి, ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.